సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను మా ప్రతినిధి ఫోన్‌ నంబర్‌కు వాట్సాప్‌ చేయండి
91829 05602
నంబర్‌లో సంప్రదించండి

క్లుప్తంగా

'గ్రీవెన్స్‌'తో సమస్యల పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్‌ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రాలు అందజేశారు. వాటిని కె.కె.రాజు పరిశీలించి కొన్నింటినీ వెంటనే పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు రిఫర్‌ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

'స్పందన'కు 8 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 8 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని డిప్యూటీ తహసీల్దార్‌ త్రినాథ్‌ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్‌ పరీక్షా పత్రాలు భద్రం



ఫోర్త్‌టౌన్‌ పీఎస్‌ ఆవరణలో పరీక్షా పత్రాలను పరిశీలిస్తున్న రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు

సీతమ్మధార: ఇంటర్మీడియట్‌ పరీక్షా పత్రాలను సోమవారం ఫోర్త్‌టౌన్‌, ద్వారకా పోలీస్‌ స్టేషన్లలో భద్రపరిచారు. మార్చి 1 నుంచి ఇంటర్‌ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టారు. రాజశేఖర్‌రెడ్డి, అధ్యాపకులు పరీక్షా పేపర్లను పరిశీలించారు. ద్వారకా జోన్‌ పరిధిలోని 12 సెంటర్లకు, ఫోర్త్‌ టౌన్‌ పరిధిలోని నాలుగు సెంటర్లకు సంబంధించిన పత్రాలను స్టేషన్‌లో భద్రంగా ఉంచారు.

28న మహిళలకు వంటలు, నడక పోటీలు

మద్దిపాలెం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న మహిళలకు వంటలు, నడక పోటీలు నిర్వహిస్తున్నట్లు మహిళా వాకర్స్‌ క్లబ్‌ ప్రెసిడెంట్‌ ఎస్‌.లలితారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 51వ వార్డులోని ఈస్ట్‌ పార్కు యాజమాన్యం సహకారంతో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి మహిళలకు ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోషకాహార పదార్థాలు తయారు చేయవచ్చని, మహిళల ఆరోగ్యం దృష్ట్యా వయసుల వారీగా అందరికీ నడక పోటీలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని ఆయా ప్రాంతాల్లో ఉండే ఆసక్తి గల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నూతన సంగీత సంస్థ ప్రారంభం



సంగీత సంస్థను ప్రారంభిస్తున్న అతిథులు

సీతంపేట: నగరానికి చెందిన గాయనీమణి బి.లక్ష్మీస్వరూప సారథ్యంలో 'శీతల్‌ స్వర్‌ ఈవెంట్స్‌' పేరిట నూతన సంగీత సంస్థ ప్రారంభోత్సవం సోమవారం ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో జరిగింది. విశాఖ గాయనీగాయకుల సాంస్కృతిక సంఘం అధ్యక్షుడు భాయ్యా శ్రీనివాస్‌, ముఖ్య సలహాదారు సన్‌మూర్తి, సంస్థ కార్యదర్శి బి.శ్రీనివాస్‌ జ్యోతి ప్రజ్వలన చేసి సంస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరానికి చెందిన గాయనీగాయకులు తమ గల మాధుర్యంతో అలరించారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్‌ నార్త్‌
8309817091

జగనన్న ఇళ్ల స్థలాలపై సర్వ హక్కులు



- సచివాలయాల్లో ఉచితంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌
- లబ్ధిదారుల హర్షాతిరేకాలు
- సీఎం వైఎస్‌ జగన్‌కు కృతజ్ఞతలు

సీతంపేట: గత ప్రభుత్వాలు ఎన్నడూ చేయని విధంగా పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాలు, ఇళ్లపై పూర్తి హక్కులను కల్పిస్తూ కన్వేయన్స్‌ డీడ్స్‌, సేల్‌ డీడ్స్‌ను జగనన్న ప్రభుత్వం అందజేస్తుండటం చరిత్రాత్మకమని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో నివసించే అందరికీ సొంతిళ్లు అందించాలన్న ఉద్దేశంతో అర్హులైన ప్రతి కుటుంబానికి సెంటు స్థలం లేదా టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తున్నారు. ఈ లెక్కన ఉత్తర నియోజకవర్గంలో 7,113 మందికి టిడ్కో ఇళ్లు, 27,995 మందికి జగనన్న హౌస్‌సైట్స్‌ మంజూరు చేస్తూ పట్టాలు అందజేశారు. అంతటితో ఆగకుండా జగనన్న ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లపై లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించేలా రిజిస్ట్రేషన్‌ చేసి సేల్‌ డీడ్స్‌ అందజేస్తున్నారు. ఒక రూపాయి ఖర్చు లేకుండా, అధికారుల చుట్టూ తిరగనక్కర లేకుండా సంబంధిత సచివాలయంలోనే ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ జోరుగా జరుగుతోంది. నియోజకవర్గంలోని బీ ఫారం స్థలాల్లో ఇళ్లు కట్టుకుని ఏళ్ల తరబడి ఎటువంటి హక్కులు లేకుండా నివసిస్తున్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ 388 జీవో ప్రకారం సంపూర్ణ హక్కులు కల్పిస్తూ 358 మంది లబ్ధిదారులకు సేల్‌ డీడ్స్‌ అందజేశారు. రిజిస్ట్రేషన్‌ చేసి పూర్తి హక్కులు కల్పించడం వల్ల ఆస్తి విలువ పెరగడమే కాక, ఆర్థిక బరోసా కల్పించారని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మర్చిపోకుండా రుణం తీర్చుకుంటామంటూ కృతజ్ఞతలు చెబుతున్నారు.



రెల్లి వీధి సచివాలయంలో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ చేస్తున్న వెల్ఫేర్‌ సెక్రటరీ, వీఆర్వో

25వ వార్డులో జోరుగా రిజిస్ట్రేషన్‌

జీవీఎంసీ 25వ వార్డులోని ఐదు సచివాలయాల పరిధిలో జగనన్న హౌస్‌ సైట్స్‌ రిజిస్ట్రేషన్‌ ప్రక్రియ జోరుగా జరుగుతోంది. మూడు సచివాలయాల్లో దాదాపు ప్రక్రియ పూర్తి కాగా, రెండు సచివాలయాల్లో జరుగుతున్నాయి. సీతంపేట(130) సచివాలయంలో 390 మంది హౌస్‌ సైట్స్‌ లబ్ధిదారులు ఉండగా.. ప్రస్తుతం 301 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. రెల్లి వీధి-1(132) సచివాలయంలో 148 హౌస్‌ సైట్స్‌కు 115 రిజిస్ట్రేషన్‌ కాగా.. హరిజన వీధి-1(131) సచివాలయంలో 417కు 363 రిజిస్ట్రేషన్‌ పూర్తయ్యాయి. రాజేంద్రనగర్‌(133) సచివాలయంలో 332 హౌస్‌ సైట్స్‌లో 131, మధురానగర్‌(134) సచివాలయంలో 239 ఇంటి స్థలాలకు 217 రిజిస్ట్రేషన్‌ అయ్యాయి. మొత్తంగా 25వ వార్డులో 1,526 మంది జగనన్న హౌస్‌ సైట్స్‌ లబ్ధిదారులు ఉండగా.. వాటిలో 1,127 రిజిస్ట్రేషన్‌ కాగా. ఇంకా 399 రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ప్రజలకు త్వరగా రిజిస్ట్రేషన్‌ పట్టాలను అందించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

ముదపాకలో ఇంటి స్థలం ఇచ్చారు



ఇప్పటి వరకు మాకు సొంత ఇల్లు లేదు. అద్దింట్లో ఉంటున్నాం. గతంలో చాలా సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేశాం. ఇల్లు రాలేదు. జగన్‌ బాబు దయవల్ల ముదపాకలో మాకు ఇంటి స్థలం ఇచ్చారు. ఇపుడు రిజిస్ట్రేషన్‌ చేసి పట్టా ఇస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. మళ్లీ జగన్‌ బాబు సీఎం కావాలి. – కళ్ల కొండ, గొల్ల వీధి

ఎటూ తిరగకుండా పట్టా అందించారు



నేను ప్రైవేట్‌ జాబ్‌ చేస్తున్నాను. 13 ఏళ్లగా అద్దె ఇంట్లో ఉంటున్నాను. గతంలో 12 సార్లు ఇంటి కోసం దరఖాస్తు చేశాను. కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగినా ఇల్లు రాలేదు. ఇపుడు ఎటూ తిరగకుండానే ఇంటి స్థలం, రిజిస్ట్రేషన్‌ చేసి పట్టా ఇచ్చారు. పథకాలు వస్తున్నాయి. ఇంతకన్నా ఏం కావాలి. – కె.వెంకటరమణ, కనకమ్మ వీధి

పూర్తి హక్కు వచ్చింది



ఇప్పటి వరకు సొంత ఇల్లు లేదు. ముగ్గురు పిల్లలతో అద్దె ఇంట్లో ఉంటున్నాం. వలంటీర్‌ ద్వారా ఇంటి కోసం దరఖాస్తు పెట్టాం. ముదపాకలో స్థలం ఇచ్చారు. ఇపుడు సచివాలయంలో రిజిస్ట్రేషన్‌ చేశారు. ఇంటిపై పూర్తి హక్కు వస్తుందని, ఆస్తి విలువ పెరుగుతుందని చెబుతున్నారు. జగనన్న మేలు మర్చిపోను. – సొండి సుజాత, రెల్లివీధి

బిహార్‌ నుంచి వచ్చి స్థిరపడ్డాం



20 ఏళ్ల కిందట బిహార్‌ నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డాం. మా భర్త టైల్స్‌ పనిచేస్తుంటారు. ముగ్గురు ఆడ పిల్లలు, ఒక బాబుతో కలిసి అద్దె ఇంట్లో ఉంటున్నాం. వలంటీర్‌ శేఖర్‌ మాచేత ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేయించారు. సచివాలయంలో పట్టా రిజిస్ట్రేషన్‌ చేశారు. ఇపుడు మేము నిశ్చింతగా ఉన్నాం. – ఇశ్రత్‌ బీబీ, సీతంపేట

జీవీఎంసీ కమిషనర్‌కు కృతజ్ఞతలు

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం, ఊర్వశి కూడలి బర్మాక్యాంప్‌ కొండవాలు ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధికి సహకారం అందిస్తున్న జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మకు కార్పొరేటర్‌ గంకల కవితా అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఆయనను కలిసి కొండవాలులో మరింత అభివృద్ధితోపాటు పెండింగ్‌ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రాన్ని అందించారు.

నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్‌: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్‌ బ్యాంక్‌ అకౌంట్‌ నంబర్‌ 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్‌, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్‌ యూబీఐఎన్‌ 0806081కు ఆన్‌లైన్‌ పేమెంట్‌ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 ఫోన్‌ నంబర్లలో సంప్రదించవచ్చు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్‌

అల్లిపురం: బహిరంగ ప్రదేశంలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను మహారాణిపేట పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. మహారాణిపేట రామజోగిపేట వద్ద ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో నగర పోలీస్‌ కమిషనర్‌ ఎ.రవిశంకర్‌, స్పెషల్‌ బ్రాంచ్‌ ఏసీపీ వెంకటరావు ఆదేశాల మేరకు టాస్క్‌ ఫోర్స్‌ ఏసీపీ ప్రసాదరావు ఆధ్వర్యంలో సీఐ అప్పలనాయుడు దాడులు చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1,15,120 నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని మహారాణిపేట పోలీస్‌ స్టేషన్‌కు అప్పగించడంతో అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్నకు చెబుదాం'కు 4 వినతులు



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్‌-5 కమిషనర్‌ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్‌-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 04 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్‌ కమిషనర్‌ ఆర్‌.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్‌ ప్లానింగ్‌ విభాగానికి 02, యూసీడీకి 01, రెవెన్యూకు 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ తెలిపారు. జగనన్నకు చెబుదాంలో వచ్చిన వినతులను తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌-1, 2 టి.ఎస్‌.ఎన్‌.రాజు, ఆర్‌.వి.రాజు, రెవెన్యూ ఆర్‌వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఏఎంహెచ్‌వో డాక్టర్‌ ఎ.సునీల్‌కుమార్‌, ఇంజినీరింగ్‌ ఈఈలు టి.ప్రసన్నరెడ్డి, మత్స్యరాజు, డీఈ భరణికుమార్‌, ఏపీడీలు పద్మావతి, ఈఈ వాటర్‌ సప్లై సూరిశెట్టి శేఖర్‌ పాల్గొన్నారు.

పోలింగ్‌ బూత్‌ల తనిఖీ

కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జీవీఎంసీ జోన్‌-5 పరిధిలోని పోలింగ్‌ బూత్‌లను సోమవారం సాయంత్రం గోపాలపట్నం తహసీల్దార్‌ రమణ తనిఖీ చేశారు. జ్ఞానాపురంలోని జోనల్‌ కార్యాలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో సరైన గదులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. బిషప్‌ మరియదాస్‌ మండపం వద్ద పోలింగ్‌ బూత్‌ ఏర్పాటుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు త్వరగా చేయాలని ఇంజినీరింగ్‌ అధికారులకు సూచించారు.

ప్రజా రవాణాతో పర్యావరణానికి మేలు



ఆర్టీసీ బస్సులో కార్యాలయానికి చేరుకుంటున్న మేయర్‌ హరివెంకటకుమారి



కార్యాలయానికి సైకిల్‌పై వస్తున్న జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ

డాబాగార్డెన్స్‌: వారంలో ఒక్కరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్‌ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. సోమవారం ఆమె తన క్యాంప్‌ ఆఫీస్‌ నుంచి జీవీఎంసీ కార్యాలయానికి ఏపీఎస్‌ ఆర్టీసీ బస్సులో చేరుకోగా.. జీవీఎంసీ కమిషనర్‌ సాయికాంత్‌ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో కాలుష్య నియంత్రణకు వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరూ ప్రజా రవాణాను వినియోగిస్తున్నామని తెలిపారు. ఎకో-వైజాగ్‌ అభివృద్ధి నేపథ్యంలో ఎకో జీరో పొల్యూషన్‌ కార్యక్రమంలో భాగంగా నగరంలో పర్యావరణ పరిరక్షణకు, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన చర్యలు చేపడుతోందన్నారు. కాలుష్య నియంత్రణకు ప్రభుత్వ, ప్రైవేట్‌ కార్యాలయాలు, కళాశాలల యాజమాన్యం, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు సహకరించి వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించాలని విజ్ఞప్తి చేశారు.

యువతతోనే భారతావని అభివృద్ధి



విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎంపీ జీవీఎల్‌, ఏయూ రిజిస్ట్రార్‌ జేమ్స్‌ స్టీఫెన్‌

ఏయూక్యాంపస్‌: భారతదేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో యువత పాత్ర కీలకమని ఎంపీ జీవీఎల్‌ నరసింహారావు అన్నారు. ఏయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సోమవారం టి.ఎల్‌.ఎన్‌. సభా మందిరంలో నిర్వహించిన యువ సంవాద్‌ సమావేశం ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విజేతలు సర్టిఫికెట్లు ప్రదానం చేసి మాట్లాడారు. దేశం ప్రథమం అనే విధంగా యువత నడచుకోవాలన్నారు. రిజిస్ట్రార్‌ ఆచార్య ఎం.జేమ్స్‌ స్టీఫెన్‌ మాట్లాడుతూ నాక్‌ గ్రేడింగ్‌లో ఏయూ అత్యుత్తమ స్థానం సాధించడంలో ఎన్‌ఎస్‌ఎస్‌ కార్యక్రమాలు, సేవలు ఉపయోగపడ్డాయన్నారు. ఉదయం జరిగిన ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్‌ మాట్లాడుతూ యువత దేశం కోసం కలలు కనాలని, వాటిని సాకారం చేసే దిశగా పనిచేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్ర మోహన్‌ మాట్లాడుతూ ప్రధాని మోదీ సూచించిన పంచ్‌ప్రాణ్‌ సూత్రాలను అంతా పాటిస్తూ వికసిత్‌ భారత్‌ను ఆవిష్కరించాలన్నారు. ఏయూ సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ పౌరులు బాధ్యతాయుత ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా వర్సిటీ స్థాయిలో పంచ్‌ ప్రాణ్‌పై నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో 30 మంది యువతీ యువకులు పాల్గొని తమ భావాలను, ఆలోచనలను పంచుకున్నారు. వక్తృత్వ పోటీలకు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన డాక్టర్‌ పి.ఉమామహేశ్వరరావు, ఇ.పి.ఎస్‌ భాగ్యలక్ష్మి, వై.అనసూయ దేవిలను సత్కరించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ సమన్వయకర్త ఆచార్య ఎస్‌.హరనాథ్‌, సైన్స్‌ కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్‌ సి.హెచ్‌ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వక్తృత్వ పోటీల్లో డి.హర్షిత(న్యాయ కళాశాల), రేవతి(సెయింటాన్స్‌), భవిత(యూ ఫార్మసీ), కె.యామిని(సెయింటాన్స్‌), శ్రీకాంత్‌ రెడ్డి(ఏయూ సైన్స్‌ కళాశాల), జి.హర్షితా రాణి(సెయింటాన్స్‌) విజేతలుగా నిలిచారు.

బుద్ధిస్ట్‌ సొసైటీ కేంద్ర కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

సీతంపేట: ది బుద్ధిస్ట్‌ సొసైటీ ఆఫ్‌ ఇండియా(టీబీఎస్‌ఐ) 11వ బౌద్ధ సమ్మేళనం రెండో రోజు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక అంబేడ్కర్‌ భవన్‌లో నూతన కేంద్ర కమిటీ ఎన్నిక జరిగింది. కమిటీ ట్రస్టీ జాతీయ అధ్యక్షుడిగా చంద్ర బోధిపాటిల్‌, ప్రధాన కార్యదర్శిగా బి.కె.బరేవ్‌, కోశాధికారిగా శంకరరావు దొంగేరే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గంలో మిగతా వారిని త్వరలో ఎన్నుకోనున్నారు. భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్‌.అంబేడ్కర్‌ కలలు గన్న ప్రబుద్ధ భారత్‌ నిర్మాణం కోసం కొత్త కమిటీ కృషి చేస్తుందని, బుద్ధుడి సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లనుందని ప్రతినిధులు తెలిపారు.

రక్షణ కల్పించాలని హాస్టల్‌ విద్యార్థుల వినతి



కలెక్టర్‌ కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

మహారాణిపేట: ఊర్వశి జంక్షన్‌ సమీపంలోని కప్పరాడ ట్రైబల్‌ వెల్ఫేర్‌ బాయ్స్‌ హాస్టల్‌లో చదువుతున్న తమకు రక్షణ కల్పించాలని, సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆల్‌ ఇండియా డెమోక్రాటిక్‌ స్టూడెంట్స్‌ ఆర్గనైజేషన్‌(ఏఐడీఎస్‌వో) విశాఖ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్‌ కార్యాలయం ఎదుట వారు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆర్గనైజేషన్‌ నగర అధ్యక్షుడు అభిలాష్‌ మాట్లాడుతూ ఇటీవల కాలంలో కొన్ని రౌడీమూకలు చీకటి పడిన తరువాత హాస్టల్‌కు వచ్చే దారిలో కాపుకాచి ఒంటరిగా వస్తున్న విద్యార్థులపై దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత డిసెంబర్‌ 9న ఒక జూనియర్‌ కాలేజీ విద్యార్థిపై దాడి చేసి మొబైల్‌ ఫోన్‌ లాక్కున్నారని, ఇటువంటి దాడులు, దోపిడీలు తరచూ జరుగుతూనే ఉన్నాయన్నారు. ఈ ఘటనలపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు అభిలాష్‌ తెలిపారు.

దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలి

అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ



డాగ్‌ స్క్వాడ్‌ శిక్షకుడికి సర్టిఫికెట్‌ అందజేస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

ఆరిలోవ: రానున్న ఎన్నికల్లో పోలీసులు దృఢ సంకల్పంతో విధులు నిర్వర్తించాలని అనకాపల్లి ఎస్పీ కె.వి మురళీకృష్ణ తెలిపారు. విశాలాక్షినగర్‌ ఏఆర్‌ పోలీస్‌ మైదానంలో సోమవారం జరిగిన మొబలైజేషన్‌ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు కవాతుతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వృత్తిపరమైన, వ్యక్తిగత క్రమశిక్షణతో పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి పోలీసులు కృషి చేయాలన్నారు. చెక్‌ పోస్టుల వద్ద పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఇటీవల విజయవాడలో జరిగిన 32వ ఆర్సీ కోర్సులో మత్తు పదార్థాలను గుర్తించడంలో మొదటి బహుమతి పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్‌ విభాగానికి చెందిన రాకీ (జాగిలం), పేలుడు పదార్థాలను గుర్తించి రెండో స్థానంలో నిలిచిన అనకాపల్లి జిల్లాకు చెందిన వోల్గా(జాగిలం) శిక్షకులను అభినందించారు. అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్‌, పి.సత్యనారాయణ, వి.సత్తిబాబు, డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఆర్‌ఐలు సతీష్‌, అరవింద్‌, కిశోర్‌, వెంకటరావు, మన్మధరావు పాల్గొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలు తీర్చాలి

సీతంపేట: ఎనర్జీ అసిస్టెంట్‌, విద్యుత్‌ కాంట్రాక్ట్‌ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.వి.మంజునాథులు, రాష్ట్ర కార్యదర్శి ఎం.బాలకాశి డిమాండ్‌ చేశారు. గ్రామ, వార్డు సచివాలయ ఎనర్జీ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి సదస్సులో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి అవినీతి రహితంగా, నేరుగా, త్వరితగతిన ప్రజలకు సేవలందాలనే గొప్ప ఆశయంతో 19 శాఖల ఉద్యోగులను నియమించిందన్నారు. వీరిలో ఎనర్జీ సెక్రటరీలకు మిగిలిన వారితో సమానంగా బెనిఫిట్స్‌ వర్తింపచేయడం లేదన్నారు. మెడికల్‌ లీవ్స్‌, ఈఎల్‌, ఇతర సెలవులు కూడా అమలు కావడం లేదన్నారు. ఔట్‌ సోర్సింగ్‌ ఉద్యోగులను తెలంగాణ తరహాలో క్రమబద్ధీకరించాలని కోరారు. ఎనర్జీ ఎంప్లాయీస్‌ యూనియన్‌ నాయకులు సూర్య, ప్రవీణ్‌, బిల్‌ రీడర్‌ యూనియన్‌ జిల్లా అధ్యక్షుడు శివారెడ్డి, ఏఐటీయూసీ నాయకులు అచ్యుతరావు, మన్మధరావు, దొరబాబు, పడాల గోవిందు పాల్గొన్నారు.

విద్యతోనే జీవితానికి వెలుగు



మహిళకు అవగాహన కల్పిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: విద్యతోనే జీవితానికి వెలుగు అంటూ కృష్ణా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించారు. జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం సోమవారం రెల్లి వీధిలో జరిగింది. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్లు సోషల్‌ సర్వే నిర్వహించారు. అందరూ చదువుకోవాలని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు.

ప్రేమసమాజంలో లిఫ్ట్‌ ఏర్పాటు

డాబాగార్డెన్స్‌: డాబాగార్డెన్స్‌ ప్రేమసమాజం ప్రాంగణంలోని కంచర్ల అన్నపూర్ణాదేవి ఏసీ ఆడిటోరియానికి ప్రేమసమాజం మాజీ అధ్యక్షుడు కంచర్ల రామబ్రహ్మం ఆర్థిక సాయంతో ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రామబ్రహ్మం మాట్లాడుతూ తన మాతృమూర్తి పేరిట నిర్మించిన ఈ ఆడిటోరియంలో వృద్ధుల సౌకర్యార్థం లిఫ్ట్‌ ఏర్పాటు చేయడం తమ కుటుంబానికి ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. ప్రేమసమాజం అధ్యక్షుడు బుద్ధా శివాజీ మాట్లాడుతూ కంచర్ల రామబ్రహ్మం కుటుంబం 3 తరాలుగా సమాజానికి అందించిన ఎనలేని సేవలను వివరించారు.

ఉక్కు పరిశ్రమ జోలికి రావొద్దు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరిస్తే చూస్తూ ఊరుకోబోమని, సంస్థ జోలికి వస్తే చరిత్రహీనులవుతారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు హెచ్చరించారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్‌ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 1,110వ రోజుకు చేరుకున్నాయి. సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



1,110వ రోజు దీక్షలో పాల్గొన్న ఉక్కు పోరాట కమిటీ నాయకులు

ఈఎన్‌టీ ఆస్పత్రిలో నూతన పరికరాలు



ఆస్పత్రిలో పరికరాలను ప్రారంభిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్‌ ఆచార్య బుచ్చిరాజు

ఏయూక్యాంపస్‌: ప్రభుత్వ చెవి, ముక్కు, గొంతు(ఈఎన్‌టీ) ఆస్పత్రిలో పీజీ విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయి. వీటిని ఆంధ్రా మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య బుచ్చిరాజు సోమవారం ప్రారంభించారు. చెవి ఎముక (టెంపోరల్‌) బోన్‌ చికిత్స విధానం చేయడంపై శిక్షణ అందించే విధంగా ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. రెండు మైక్రోస్కోప్‌లు, వీడియో స్టేషన్లతో ప్రత్యక్షంగా వీక్షించే విధంగా అందుబాటులో ఉంచారు. చెవికి సంబంధించిన శస్త్ర చికిత్సలు చేయడానికి, నిపుణులుగా పీజీ విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఈ ప్రయోగశాల ఉపయుక్తంగా నిలుస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ హరికృష్ణ తెలిపారు. ఆస్పత్రి వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్‌ నార్త్‌
9010810033
Office mail : sakshiadvtvsp@gmail.com